అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట!

ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు



సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

రసూల్‌పురా: బాలంరాయి కమాన్ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. ఇంతా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ట్రావెల్స్ యజమానుల ఆగడాలు మితిమీరిపోయాయి. ఈ సమస్యపై ఈనెల 10న 'పార్కింగ్ ఇలా.. రాకపోకలు ఎలా' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి మారేడుపల్లి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. బాలంరాయి కమాన్ వద్దకు చేరుకుని రోడ్డుకు నిలిపి ఉన్న బస్సుల తాళాలు తీసుకుని డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. రోడ్లపై ఇష్టానుసారంగా బస్సులు ఆపరాదని ట్రాఫిక్ ఎస్‌ఐ హరిష్‌గౌడ్ హెచ్చరించారా. టీ-ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఇటుక గోపి ఆధ్వర్యంలో పలువురు స్థానికులు బోర్డు కార్యాలయంలో కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్‌ను కలిసి బస్సులు రాకుండా గడ్డర్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారులతో మాట్లాడి గడ్డర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని సీఈవో హామీచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్, శ్రీనివాస్, మధు, వినోద్‌కుమార్ మురళి గౌడ్, ఉమేష్ పాల్గొన్నారు.



సీఈవోకు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

పేరు గొప్ప... ఊరు దిబ్బ!





రహదారులు మూసేసిన రైల్వే అధికారులు

అభివృద్ధికి ఆమడదూరంలో లష్కర్

- ఆది నుంచీ అధికార పార్టీ ఎంపీలే
- అందులో పలువురు కేంద్ర మంత్రులు
- రెండోసారి కేంద్ర మంత్రి అయిన కిషన్‌రెడ్డిపై కోటి ఆశలు

సికింద్రాబాద్: కేంద్రంలో కాంగ్రెస్, బీజేపీలలో ఏదో ఒక పార్టీ అధికారంలోకి రావడం, అదే పార్టీకి చెందిన రాజకీయ ప్రతినిధులే సికింద్రాబాద్ ఎంపీగా గెలుస్తుండడం ఆనవాయితీగా వస్తుంది. ఇలాంటి నేపథ్యంలో ఈ ప్రాంతానికి ఏదో లబ్ధి చేకూరుతుందన్న ఆశలు సహజంగానే ఇక్కడి ప్రజల్లో చిగురిస్తున్నాయి. అందులోనూ ఇక్కడి నుంచి గెలిచిన ఎంపీలు పలుమార్లు కేంద్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరిస్తుండటంతో లష్కర్ ప్రజల ఆశలు రెట్టింపు అవుతున్నాయి. ఇక్కడి నుంచి తాజా ఎంపీగా గెలిచిన కిషన్‌రెడ్డి రెండవ సారి కేంద్ర కేబినెట్‌లో చేరారు. గత ప్రభుత్వంలోనూ ఆయన మంత్రిగా కొనసాగినప్పటికీ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో చెప్పుకోదగిన అభివృద్ధి పనులు ఏవీ జరగలేదు. ఎంపీలాడ్స్ నిధుల నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల ముందు రోగుల కోసం షెడ్లు, వసతులు మాత్రమే ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాల రైల్వేస్టేషన్ల అభివృద్ధి, ఓయూకు నిధులు వంటివి రూ. వేల కోట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హయాంలోనే వచ్చాయని ఇక్కడి బీజేపీ నేతలు చెబుతున్నమాట వాస్తవమే అయినా ఓట్లు వేసి గెలిపించిన సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ ప్రజలకు చెప్పుకోదగిన అభివృద్ధి పనులు ఏవీ చేయలేదన్న విమర్శలు సైతం ఉన్నాయి.

కమ్యూనిటీహాళ్లకే పరిమితం..

ఎంపీ కిషన్‌రెడ్డికి ముందు పార్లమెంట్ మెంబర్‌గా కొనసాగిన బండారు దత్తాత్రేయ, అంజన్‌కుమార్‌యాదవ్ నేతృత్వంలోనూ చిన్నపాటి కమ్యూనిటీహాళ్లు, ఇటర్నల్ రహదారుల వరకే నామమాత్రపు నిధులతో పరిమితం చేశారు. దత్తాత్రేయ మూడు మార్లు మంత్రిగా పనిచేసినా దీటైన అభివృద్ధి పనులు ఈ నియోజకవర్గంలో జరిగిన ఆనవాళ్లు లేవు. ఇక్కడి సమస్యలు ఎంపీలు, కేంద్ర ఆమాత్యుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు తెప్పించే విషయంలో లష్కర్ బీజేపీ నాయకులు విఫలమవుతున్నారు. ఇప్పుడు బీజేపీ, అప్పట్లో కాంగ్రెస్ నేతల మధ్య సయోధ్య లేమి కారణంతో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు జరగనట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల బీజేపీ నాయకుల మధ్య సయోధ్య లేదు. నాయకత్వ ఎదుగుదల మినహా సమస్యల పరిష్కారం, భారీ అభివృద్ధి పనులపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా చిన్నపాటి అభివృద్ధి పనులకే ఎంపీలాడ్స్ నిధులు పరిమితమవుతున్నాయి.

కేంద్ర మంత్రిపై ఆశలు..

నియోజకవర్గంలో 40 శాతం రైల్వే స్థలాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖల మధ్య అభివృద్ధి పనుల విషయంలో స్థల వివాదాలు ఉన్నాయి. రైల్వే స్థలాల మీదుగా తాగు నీరు, డ్రైనేజీ లైన్ల నిర్మాణాలను అధికారులు అడ్డుకుంటుండటంతో పలు పనులను ఆగిపోయాయి. రైల్వే కాలనీలు, సాధారణ జనవాసాలు ఇక్కడ మిలితమై ఉన్నాయి. క్రమేణా రైల్వే రహదారుల మీదుగా సాధారణ ప్రజల రాకపోకలపై రైల్వే అధికారులు ఆంక్షలు విధిస్తున్నారు. హమాలీబస్తీ, లాలాగూడ, మెట్టుగూడ డివిజన్లలో పలు రహదారులను మూసివేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడి బీజేపీ నాయకులు అంకితభావంతో కృషి చేస్తే రైల్వే మోకాలడ్డుతున్న పలు సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. అంతేకాక ఇక్కడి పార్కులు, రహదారుల ఆధునీకరణ, విద్యా వసతులు, క్రీడా మైదానాల ఏర్పాటు, ప్రజలకు పలు అనర్థాలు తెచ్చి పెడుతున్న నాలా ఆధునీకరణ వంటి అభివృద్ధి పనులు ఎంపీ, కేంద్రమంత్రి ప్రత్యేక నిధులతో పూర్తిచేయించే అవకాశాలు ఉన్నాయి. నిరుపయోగంగా ఉంటున్న రైల్వే స్థలాల్లో యువతకు కేంద్ర ప్రభుత్వం తరపున ఏదైనా శిక్షణ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయిస్తే ఇక్కడి నిరుద్యోగ యువకులకు ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయనే కోటి ఆశలు కిషన్‌రెడ్డిపై లష్కర్ ప్రజలు పెట్టుకున్నారు.

అందరూ జాతీయ పార్టీ నేతలే..

సికిందాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రత్యేకతే వేరు. నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఒకటి, రెండు మార్లు మినహా కేంద్రంలో అధికారంలోకి వచ్చిన పార్టీకి చెందిన అభ్యర్థులే విజయం సాధిస్తూ వస్తున్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఏ పార్టీ ఎంపీ గెలిస్తే ఆ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్నది నానుడి. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు, వెనుక జరిగిన ఏడు పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందిన ఎంపీలు అందరు అధికార పార్టీ అభ్యర్థులే కావడం గమనార్హం. ఒక్క మాటలో చెప్పాలంటే ఇక్కడి నుంచి ఎంపీలుగా గెలిచిన వారందరూ జాతీయ పార్టీలకు చెందినవారు. అందులోనూ అధికార పార్టీ ఎంపీలుగా ఉండడం గమనార్హం. అంజన్‌కుమార్ యాదవ్ (కాంగ్రెస్) రెండుసార్లు, బండారు దత్తాత్రేయ (బీజేపీ) మూడు సార్లు ఎంపీగా గెలిచారు. తాజాగా జీ.కిషన్‌రెడ్డి రెండు సార్లు ఎంపీగా గెలిచారు. అంతేకాదు ఇక్కడి నుంచి గెలిచిన ఎంపీల్లో బండారు దత్తాత్రేయ మూడుసార్లు కేంద్ర మంత్రిగా పనిచేశారు. కిషన్‌రెడ్డి మొదటిసారి ఎంపీగా గెలిచినపుడు కేంద్ర కేబినెట్ మంత్రిగా పనిచేశారు. తాజాగా రెండవ సారి ఎంపీగా గెలిచి మళ్లీ కేంద్ర కేబినెట్‌లో తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. రెండోసారి కేంద్ర కేబినెట్‌లో ఉన్న కిషన్‌రెడ్డి ఎలాంటి అభివృద్ధి చేస్తారో అని లష్కర్ వాసులు చర్చించుకుంటున్నారు.



రోగుల వసతి కోసం అడ్డగుట్ట ప్రభుత్వ ఆసుపత్రి ముందు కిషన్‌రెడ్డి ఎంపీ నిధులతో నిర్మించిన షెడ్డు

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.47, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 63, పచ్చకాకర 45, పందిరి బీర 55, క్యాబేజీ 21, క్యారెట్ 40, దొండ 18, గుండుబీన్స్ 65, గింజ బీక్కుడు 55, గోకరకాయ 45, కీర 28, దోసకాయ 28, రూట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 35, చామగడ్డ 40, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 12, మునగకాయ 3–4, ముల్లంగి 4–5.

ఓయూ భూములను కాపాడాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ భూములను కాపాడాలని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బారి అశోక్‌కుమార్ యాదవ్, వడ్డె గణేష్ సోమవారం డిమాండ్ చేశారు. వర్సిటీ క్యాంపస్ సరిహద్దులో గల స్థలాన్ని ఆక్రమించి కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపడుతుండగా కోర్టు వివాదంలో ఉన్న (యథాతథ స్థితి) ఉన్న భూమిలో మరికొందరు తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఏకంగా అపార్టుమెంట్లు నిర్మిస్తున్నారన్నారు. వర్సిటీ అధికారులు స్పందించి నూతన నిర్మాణాలను కూల్చివేయాలని లేకుంటే భవనాలను నేలమట్టం చేస్తామన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

అడ్డగుట్ట: ఫుట్‌పాత్‌లు ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగిస్తే చర్యలు తప్పవని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ శానిటేషన్ జవాన్ రాజు హెచ్చరించారు. మంగళవారం సికింద్రాబాద్ సర్కిల్ శానిటేషన్ అధికారులు అడ్డగుట్టలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలకు పాల్పడి వ్యాపారాలు కొనసాగిస్తున్న దుకాణదారులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. వివిధ దుకాణదారులు ఫుట్‌పాత్ ఆక్రమణలకు పాల్పడుతూ దుకాణంలోని వ్యర్థాలను రోడ్లపైనే వేస్తున్నారని అలాంటి వారికి జరిమానాలు విధించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అడ్డగుట్టలో రోడ్లపై వ్యర్థాలు పడేస్తున్న కొబ్బరిబోండా, మెకానిక్ షాపు, ఇంటి నిర్మాణదారులకు జరిమానాలు విధించినట్లు ఆయన తెలిపారు.



కొబ్బరిబోండా దుకాణదారుడికి జరిమానా విధిస్తున్న దృశ్యం

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: వర్షాకాలం నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తార్నాకలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్లపై నీరు నిలువకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం వరకు రోడ్లపై ఎలాంటి తవ్వకాలు చేపట్టవద్దని విద్యుత్ తీగలు, స్ట్రీట్ లైట్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. పురాతన కట్టడాలు, అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. ఈ సమీక్షలో డిప్యూటీ కమిషనర్ సుభాష్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ హేమలత, ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ ఆశాలత, వాటర్ వర్క్స్ డీజీఎం సరిత, మేనేజర్లు కృష్ణప్రసాద్, నికిత, హార్టికల్చర్ మేనేజర్ గణేష్, ఏఈ వెంకటేష్ పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం



అనూష

బౌద్ధనగర్: కుటుంబ కలహాలతో ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుధాకర్ వివరాల ప్రకారం.. వారాసిగూడలోని అంబర్‌నగర్‌లో నివాసముంటున్న ఎస్.అనూష(20), బాలరాజు దంపతులు. ఈ నెల 6న భార్యాభర్తల మధ్య గొడవ జరగగా మరుసటి రోజు బాలరాజు పనికి వెళ్లిన సమయంలో భార్య అనూష ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి వచ్చిన బాలరాజుకు భార్య కనిపించకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో విద్యార్థిని..



వైష్ణవి

లాలాపేట: విద్యార్థిని అదృశ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 10న వారాసిగూడ ఉప్పర్‌బస్తీకి చెందిన వైష్ణవి(23) పీజీ పరీక్షల కోసం ఆమె సోదరుడు నరేందర్ ఆమెను ద్విచక్ర వాహనంపై ఓయూలోని ప్రొ. రామిరెడ్డి దూర విద్యా కేంద్రం వద్ద వదిలాడు. సాయంత్రం పికప్ చేసుకునేందుకు రాగా వైష్ణవి అక్కడ లేదు. ఫోన్‌లో సైతం అందుబాటులో లేదు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తండ్రి రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

అడ్డగుట్ట: డివిజన్‌లో అన్ని రకాల మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి తెలిపారు. మంగళవారం అడ్డగుట్టలోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో పవర్‌బోర్ పనులకు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రాంతాల వారీగా ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని, అందులో భాగంగా నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో పవర్‌బోర్లు వేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లింగాని శ్రీనివాస్, సత్తయ్య, మనోహర్, శ్రీనివాస్‌గౌడ్, వసంత, మహ్మద్, గౌస్, అమర్, రామస్వామి, నర్సింగ్, స్వరూప, భాగ్య పాల్గొన్నారు.



పవర్‌బోర్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అక్రమ నిర్మాణాలపై 'ప్రజావాణి'లో ఫిర్యాదు



ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన మాతాజీనగర్ బస్తీవాసులు

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ మాతాజీనగర్‌ను ఆనుకుని ఉన్న హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో వెలిసిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలంటూ మంగళవారం బస్తీవాసులు, బీజేపీ నాయకులు 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు. మాతాజీనగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడు నరేష్, బీజేపీ నేత నెమలి ఆనంద్ నేతృత్వంలో మహిళలు, బస్తీవాసులు ప్రజాభవన్‌కు వెళ్లి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాతాజీనగర్ బస్తీకి ఆనుకుని ఉన్న సర్వేనెంబర్ 194/8/1లో 10 ఎకరాల 20 గుంటల స్థలం ఉందని, ఇది ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ గతంలో ఇక్కడ చేపట్టిన నిర్మాణాలను అధికారులను కూల్చివేశారని గుర్తు చేశారు. తాజాగా కొందరు ఈ స్థలంలో నిర్మాణాలతో పాటు ఓ ప్రార్థనా మందిరాన్ని కూడా నిర్మించి మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అధికారులు నుంచి స్పందన రాకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోవింద్, మైసూర్ మధు, శ్రావణ్‌కుమార్, పాండ్యన్, ప్రమోద్, సాయిలు, లక్ష్మణ్, చంద్రకళ, కృష్ణ, సునీత, శోభ, మంగ, ఉషా, గంగారం, దేవిక పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తా

రసూల్‌పురా: ఎన్నికల ముందుకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తానని కంటోన్మెంట్ శాసనసభ్యుడిగా ఎన్నికైన శ్రీగణేష్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి మహిళా నాయకురాలు నాగినేని సరిత ఆధ్వర్యంలో శాస్త్రీనగర్‌లో స్వాగత వేదిక ఏర్పాటు చేసి ఘన శ్రీగణేష్‌కు స్వాగతం పలికారు. శాస్త్రీనగర్, లాల్‌బజార్‌లో విజయోత్సవ రోడ్‌షో నిర్వహించారు. శ్రీగణేష్ మాట్లాడుతూ.. తన విజయం కోసం పనిచేసిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రేమండ్, శాంసన్, అరవింద్, భవానీ, ప్రభు, అమిత్, డెంజిల్, మహేష్, అన్నూ, సందీప్, రాకేష్ పాల్గొన్నారు.



విజయోత్సవ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

ఓయూలో మోదీ దిష్టిబొమ్మ దహనం



ఉస్మానియా యూనివర్సిటీ: నీట్‌లో జరిగిన అక్రమాలను నిరసిస్తూ ఓయూలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను ఎస్ఎఫ్‌యూఐ నాయకులు దహనం చేశారు. ఎస్ఎఫ్‌యూఐ ఓయూ అధ్యక్షులు మేడ శ్రీను ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాస్తారోకోతో ఆందోళన చేపట్టారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకుల అండతో నీట్ పేపర్ లీక్ అయిందని ఆరోపించారు. నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు.

విచారణ చేపట్టాలి..

నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై కమిటీ వేసి విచారణ చేపట్టాలని తెలంగాణ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. ఎంతో కష్టపడి చదివి పరీక్ష రాసిన విద్యార్థులకు ఫలితాల్లో అన్యాయం జరుగుతుందన్నారు. ఒకే పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు టాప్ ర్యాంకులు రావడం అనుమానాలకు తావిస్తోందన్నారు. రాజకీయ నాయకులు, కార్పొరేట్ శక్తుల అండతోనే అక్రమాలు జరిగినట్లు తెలుస్తోందన్నారు. ఎన్‌టీఏను రద్దు చేసి కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలోనే తిరిగి నీట్ పరీక్షను నిర్వహించి మెరిట్ స్టూడెంట్స్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఒకేపని.. రెండు ప్రారంభోత్సవాలు



బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్



మరోసారి ప్రారంభిస్తున్న నివేదిత

కంటోన్మెంట్‌లో రాజుకున్న రాజకీయ రగడ

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో అప్పుడే పవర్ పాలిటిక్స్ జోరందుకున్నాయి. ఒకే బోర్‌వెల్ పనులకు రెండుసార్లు ప్రారంభోత్సవాలతో ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారు. ఆ ఇద్దరు నేతల పోటా పోటీ ప్రారంభోత్సవాలు బోర్డు అధికారులకూ తలనొప్పిగా మారాయి. మొత్తానికి కంటోన్మెంట్‌లో ఆ ఇద్దరు నేతల మధ్య టోకాల్ వివాదం రాజుకుంది. వారిలో ఒకరు తాజా ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే శ్రీగణేశ్ కాగా, మరొకరు ఓటమి చెందిన బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత. నియోజకవర్గం ఐదోవార్డు పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన బోర్‌వెల్ పనులకు ఎమ్మెల్యే శ్రీగణేశ్ ప్రారంభోత్సవం చేశారు. అయితే ఆ నిధులు తన తండ్రి హయాంలో మంజూరయ్యాయి కాబట్టి, తానే అర్హురాలినంటూ బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత మరోసారి బోర్‌వెల్ పనులు ప్రారంభించడం వివాదాస్పదంగా మారింది. ఇదే విషయమై బోర్డు అధికారులను వివరణ కోరగా.. బోర్‌వెల్ ప్రారంభోత్సవానికి సంబంధించి తమకు ముందస్తు సమాచారం లేదని అయితే ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రారంభించాల్సి ఉంటుందని, స్థానిక ఎంపీ, బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యులకు మాత్రం అధికారిక ఆహ్వానం ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు కార్యక్రమంలో పాల్గొనడానికి అభ్యంతరం లేదు కానీ, అధికారికంగా ప్రారంభోత్సవాలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

శుభాకాంక్షలు



కిషన్ రెడ్డిని కలిసిన రాజు

బౌద్ధనగర్: కేంద్ర మంత్రిగా నియమితులైన కిషన్‌రెడ్డిని ఢిల్లీలోని ఆయన నివాసంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమ నాయకుడు ఎనుగంటి రాజు నేత కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాజు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరు తెలంగాణ యాత్ర చేపట్టి రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ప్రజ ల ఆకాంక్షను అప్పటి ప్రభుత్వాలకు తెలిపిన గొప్ప నాయకులు కిషన్‌రెడ్డి అని పేర్కొన్నారు.

రాంగోపాల్‌పేట్: కేంద్ర మంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రెడ్డికి బీజేపీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు చీర సత్యనారాయణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి అభినందనలు తెలుపడంతో పాటు భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

పారా మెడికల్ విద్యార్థినికి రూ.37 లక్షల వార్షిక వేతనం

రాంగోపాల్‌పేట్: బీఎస్సీ కార్డియాలజీ చేసిన పారా మెడికల్ డిగ్రీ విద్యార్థిని బ్రిటన్‌లో రూ.37 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగానికి ఎంపికయింది. తెనాలి పట్టణానికి చెందిన నిస్సీ లియోన్ శ్రీకాకుళంలోని బొల్లినేని మెడిస్కిల్స్ ప్యారా మెడికల్ కళాశాలలో బీఎస్సీ కార్డియాలజీ పూర్తి చేసింది. యూకేలోని నేషనల్ హెల్త్ సర్వీస్‌కు చెందిన సంస్థ ప్రపంచ వ్యాప్తంగా వైద్య, వైద్య విభాగాల్లో నైపుణ్యం ఉన్న వారిని పేరున్న స్వచ్ఛంద సంస్థల ద్వారా ఎంపిక చేస్తోంది. హైదరాబాద్‌లోని ఈ స్వచ్ఛంద సంస్థ బొల్లినేని మెడిస్కిల్‌ను సంప్రదించారు. బొల్లినేని మెడిస్కిల్స్ ప్రోత్సాహకంతో పాటు కఠోర శ్రమ, నైపుణ్యంతో ఆమె గత ఏడాది జరిగిన బ్రిటిష్ సొసైటీ ఆఫ్ ఎకోకారియోగ్రాఫీ నిర్వహించిన ట్రాన్స్ థొరాసిక్ ఎకోకార్డియోగ్రాఫి పరీక్షకు హాజరై ఈ ఉద్యోగానికి ఎంపికయింది. మంగళవారం నిస్సీ లియోన్ సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో ఆస్పత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావును కలువగా ఆయన ఆమెను అభినందించారు.



నిస్సీ లియోన్‌ను అభినందిస్తున్న కిమ్స్ ఎండీ భాస్కర్‌రావు

బీజేపీ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదు

ఎంపీ బలరాంనాయక్



గాంధీ ఆస్పత్రిని సందర్శిస్తున్న ఎంపీ బలరాంనాయక్

గాంధీఆస్పత్రి: ప్రాంతీయ పార్టీల మద్దతుతో ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం ఎక్కువ రోజులు మనుగడ సాగించలేదని, మరి కొన్ని నెలల్లో దేశ రాజకీయాల్లో పెను మార్పులు సంభవించే అవకాశం ఉందని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ ఆరోపించారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిని మంగళవారం ఆయన సందర్శించి వైద్య సేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పనితీరు బాగుందని కేంద్ర నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. తెలంగాణలో మరో పదేళ్లు కాంగ్రెస్ పార్టీకి అధికారంలో ఉంటుందన్నారు.గాంధీలో అందిస్తున్న వైద్య సేవలు బేష్‌గ్గా ఉన్నాయని, త్వరలోనే ఎనిమిది మంది ఎంపీలతో కలిసి గాంధీ ఆస్పత్రిని సందర్శిస్తానన్నారు. గాంధీ ఆస్పత్రి అభివృద్ధికి కేంద్ర నిధులు తెచ్చేందుకు కృషి చేస్తామని, ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని అన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ శ్రీహరి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, రేడియాలజీ హెచ్‌ఓడీలు శ్రవణ్‌కుమార్, శాంతిశ్రీ, యూరాలజీ, అనస్థీషియా ప్రొఫెసర్లు రవి జాగీర్దార్, శ్రీదేవి, ఆర్ఎంఓ బ్రహ్మేశ్వర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అడ్డగుట్ట: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన విజయ్‌కుమార్(39) నాంపల్లి సీబీఐ కోర్టులో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తుంటాడు. సోమవారం సాయంత్రం ఈస్ట్‌మారేడుపల్లిలోని డెక్కన్ క్లబ్ సమీపంలో తన భార్య నూతనంగా డ్యాన్స్ స్కూల్ ప్రారంభిస్తోంది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ అక్కడికి వెళ్లి డ్యాన్స్ స్కూల్‌కు సంబంధించిన నేమ్ బోర్డును బిగిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి కరెంట్ షాక్‌కు గురయ్యాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.